క్లుప్తంగా

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీలో నూతనంగా పదవులు పొందిన నేతలు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల నూతనంగా పార్టీ ఎన్టీఆర్ జిల్లా అర్బిజన్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ముక్కామల కేదారేశ్వరరావు వెలంపల్లి శ్రీనివాస రావును అయన కార్యాలయంలో శనివారం కలిసి కృతజ్ఞతలు తలెఇపారు. తన కు పదవిని కేటా యించటంపై ధన్యవాదాలు తె లిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాస రావు ముక్కామల కేదారేశ్వరరావును శాలువా తో సత్కరించి శుభా కాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు కళాశాల నుంచి పారిశ్రామిక రంగానికి మారే క్రమంలో తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రముఖ బిజినెస్ స్కిల్స్ ట్రైనర్ మేఘన అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో 'క్యాంపస్ టు కార్పొరేట్' అంశంపై సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా మేఘన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి కార్పొరేట్ రంగానికి మారే క్రమంలో విద్యార్థులు పలు అంశాలపై దృష్టి సారించాలన్నారు. పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాలు, పరిశ్రమల అంచనాలు, మార్కెటింగ్ పరిస్థితులు తదితర అంశాలపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణకుమార్, విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మనోధైర్యంతో ముందుకు సాగితే విజయం

సినీ హీరో మంచు మనోజ్



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ లక్ష్య సాధనలో ఎదురయ్యే ఒడిదుడుకులను అధిగమించి మనోధైర్యంతో ముందుకు సాగాలని, అప్పుడే విజయం సాధించవచ్చని సినీ హీరో మంచు మనోజ్ పేర్కొన్నారు. స్టూడెంట్ ట్రైబ్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన విద్యా సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మనోజ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ హిట్లు, ఫ్లాపులు సహజమేనని, హిట్ వచ్చినప్పుడు పొంగిపోయి ఫ్లాపు అయినప్పుడు నిరాశ చెందకూడదన్నారు. జీవితంలో మనం నేర్చుకునే ప్రతి పని ఏదో ఒక సందర్భంలో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరిలో ఒక హీరో ఉంటాడని, అతన్ని మేల్కొలిపి చైతన్యవంతుడిని చేస్తే అద్భుతాలు సృష్టించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడని అన్నారు. తాను నటించిన మిరాయి చిత్రం వచ్చే నెల 12న విడుదల కానుందని వెల్లడించారు. ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచు మనోజ్ ఒక విద్యార్థినికి సుమారు రూ.30 వేల విలువచేసే లాప్‌టాప్‌ను ఉచితంగా అందజేశారు.

హద్దులు దాటి అక్రమ వసూళ్లు!

- పార్కింగ్ ఫీజు పేరుతో అడ్డగోలు దోపిడీ
- కారుకు రూ.100 నుంచి రూ.500 వరకు వసూలు
- వీఎంసీ ఆదాయానికి భారీ గండి
- దోపిడీదారులతో అధికారుల కుమ్మక్కు



బొడ్రాయి బొమ్మ సెంటర్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి కార్లలో వచ్చే భక్తులను కొంతమంది పార్కింగ్ ఫీజు పేరుతో దోచుకుంటున్నారు. ఎక్కడెక్కడో నుంచి కుటుంబసభ్యులతో కారులో వచ్చే భక్తులు మున్సిపల్ కార్పొరేషన్ పేరుతో ఉన్న పార్కింగ్ ఫీజు రశీదు ఇస్తుండటంతో నిజమో అనుకుని డబ్బులు ఇస్తున్నారు. కారు పార్కింగ్ ఫీజు పేరుతో గంటకు రూ.100, రెండు గంటలు దాటితే రూ.500 అనధికారికంగా వసూలు చేస్తున్నారు. ఈ అక్రమ వసూళ్ల దందాతో నగరపాలక సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. ఈ విషయమై పలు ఫిర్యాదులు వస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అక్రమంగా భక్తులను దోపిడీకి గురి చేస్తున్న కొంత మంది ప్రైవేట్ వ్యక్తులతో నగరపాలక సంస్థ అధికారులు కుమ్మక్కు అయ్యారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. బాధితులు పార్కింగ్ దందా గురించి విద్యాధరపురం 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా దృష్టికి తీసుకురావడంతో ఇటీవల ఆమె మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రను కలిసి అనధికార అక్రమ పార్కింగ్ ఫీజును నిలుపుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. కానీ ఎలాంటి స్పందన లేదు. పార్కింగ్ ఫీజు పేరుతో దోపిడీ కొనసాగుతూనే ఉంది.

పశ్చిమ నియోజకవర్గం పరిధిలో....

పశ్చిమ నియోజకవర్గం వన్‌టౌన్ ప్రాంతంలోని వినాయకుడి గుడి వద్ద (కెనాల్ రోడ్) నుంచి ఏలూరు లాకుల వరకు (37వ డివిజన్ పరిధి) పార్కింగ్ ఫీజు వసూలు నిమిత్తం నగర పాలక సంస్థ పిలిచిన టెండర్‌ను ఒక వ్యక్తి పాడుకున్నారు. పార్కింగ్ ఫీజు మొత్తాన్ని పేర్కొంటూ మున్సిపల్ కార్పొరేషన్ పేరు మీద రశీదులు ముద్రించుకున్నారు. అంత వరకు బాగానే ఉన్నా హద్దులు దాటి 38వ డివిజన్ పరిధిలో పార్కింగ్ చేసిన వాహనాల దగ్గర కూడా అదే రశీదు స్లిప్‌ను ఉపయోగిస్తూ అనధికారికంగా ఫీజు వసూలు చేస్తున్నారు. పార్కింగ్ ఫీజు వసూలుకు పాడుకున్న హద్దులుదాటి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తుండంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించిన హద్దు మీరి ఇష్టారాజ్యంగా సాగుతున్న ఈ అక్రమ వసూళ్లపై భక్తులు మండి పడుతున్నారు.

అధికార పార్టీ ముసుగులో కాంట్రాక్టర్ దౌర్జన్యాలు....



38వ డివిజన్ పరిధిలో ప్లై ఓవర్ కింద పార్కింగ్ చేసిన వాహనాలు

పార్కింగ్ ఫీజు వసూలుకు నిర్ణయించిన ప్రాంతమే కాకుండా 38వ డివిజన్ పరిధిలోని బొడ్రాయి బొమ్మ సెంటర్ ప్రాంతం మొదలుకుని మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ వరకు కూడా అదే రశీదు ఇచ్చి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని భక్తులు చెబుతున్నారు. అదేమని అడిగితే అధికార పార్టీ ముసుగులో టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ తన సిబ్బందితో దౌర్జన్యం చేయిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు రూ.20 వేలు, శుక్రవారం, పండుగ దినాలు, దసరా ఉత్సవాల రోజుల్లో సుమారు రోజుకు రూ.50 వేలు వసూలు చేస్తున్నారు. ఇదంతా అనధికార అక్రమ వసూళ్లు కాబట్టి మొత్తం కాంట్రాక్టర్ జేబులోకే వెళుతుండటంతో నగరపాలక సంస్థ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతుంది. అక్రమంగా వసూలు చేసిన మొత్తంలో స్థానికంగా ఉంటున్న ఒక టీడీపీ నాయకుడికి వాటా ఉన్నట్లు సమాచారం.

టీడీపీ, బీజేపీ నాయకులు డిష్యూం..డిష్యూం...

పార్కింగ్ ఫీజు హద్దు విషయంలో బొడ్రాయి ప్రాంతంలో ఇటీవల టీడీపీకి చెందిన కాంట్రాక్టర్‌కు బీజేపీ నాయకులకు మధ్య ఘర్షణ జరిగింది. ఫ్లెఓవర్ కింద రథం సెంటర్‌లో ఆటో డ్రైవర్లు, ఓనర్లు కలిసి ఒక యూనియన్‌గా ఏర్పడి ఒక స్టాండ్ ఏర్పాటు చేసుకున్నారు. జెండా దిమ్మె నిర్మించుకుని ఓపెనింగ్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌ను ఆహ్వానించారు. ఇంతలో పార్కింగ్ కాంట్రాక్టర్ టీడీపీకి చెందిన మైలవరపు వీరబాబు వచ్చి తాను డబ్బు కట్టి పాడుకున్న పార్కింగ్ ప్రదేశంలో ఆటో స్టాండ్ ఏమిటని యూనియన్ జెండాను పీకేసేందుకు యత్నించటంతో ఆయనకు, అడ్డూరి శ్రీరామ్‌కు మధ్య ఘర్షణ జరిగి ఒకరినొకరు తోసుకున్నారు. నీ హద్దులు దాటి వస్తే ఊరుకునేది లేదని శ్రీరామ్ హెచ్చరించడం, ఆటో కార్మికులంతా కలిసి వీరబాబుపై తిరగబడటంతో అతను అక్కడ నుంచి జారుకున్నాడు.



పార్కింగ్ కాంట్రాక్టర్ వీరబాబు, అడ్డూరి శ్రీరామ్ మధ్య ఘర్షణ(ఫైల్)



అనధికార వసూళ్లు చేస్తున్న కాంట్రాక్టర్ సిబ్బంది

డీసిల్టింగ్ పనులు పూర్తి చేయండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



అవుట్‌ఫాల్ డ్రెయిన్ పూడికతీత పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్‌లలో డీ సిల్టింగ్ పనులు పూర్తి చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం వన్‌టౌన్, నైజాం గేట్, కృష్ణవేణి క్లాత్ మార్కెట్, కబేళ, హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్లలో వ్యర్థాలు ఉన్న వెంటనే వాటిని తొలగించాలని, కృష్ణవేణి మార్కెట్ వద్ద ఉన్న అవుట్ ఫాల్ డ్రెయిన్లలో వెంటనే ఎస్కలేటర్‌ను అమర్చి అక్కడున్న వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అవుట్ ఫాల్ డ్రెయిన్ల వద్ద ఫెన్సింగ్, గేటును ఏర్పాటు చేయాలని, నాలా మాన్‌తో ఎప్పటికప్పుడు పూడికలు తీసేలా గేట్ తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన కబేళాను సందర్శించి మాట్లాడుతూ జంతు వ్యర్థాలను సక్రమంగా నిర్వహణ చేయాలని, జంతు వ్యర్థాలతో సంపద సృష్టించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలగణపతి నిజరూప దర్శనం



బాలగణపతికి అభిషేకాలను నిర్వహిస్తున్న అర్చకులు



కృష్ణానది నుంచి పవిత్ర జలాలను తీసుకొస్తున్న మహిళలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ బాలగణపతి నిజరూపంలో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పూజారి వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ బాలగణపతి మందిరంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం స్వామి వారికి విశేష అలంకారం నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో వైదిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం 108 మంది మహిళలు కృష్ణానది నుంచి పవిత్ర జలాలను ఊరేగింపుగా తీసుకొచ్చిస్వామి వారికి అభిషేకించారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం నిజరూపంలో స్వామి వారి దర్శనమిచ్చారు. అలాగే సహస్ర మోదక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి వారికి పంచహారతుల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

ఉత్సవాల్లో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సౌజన్యంతో చిన్నారులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల బొమ్మలను చూడముచ్చటగా వేసి అలరించారు. అలాగే రాత్రి కాకరపర్తి జగన్‌మోహని బృందం సంకీర్తనాగానాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి వెంకటకృష్ణారావు ఉత్సవ ప్రముఖులు ఎం వేణుగోపాలరావు, ఎంవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందికి సన్మానం



పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని సత్కరిస్తున్న సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీ సరిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలు అందించి పదవీ విరమణ చేసిన సిబ్బందికి శనివారం పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీ కేజీవీ సరిత ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం జరిగింది. కమిషనరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ మనమంతా ఒకే పోలీసు కుటుంబం అన్నారు. ప్రజా సేవకు మీ శక్తి, సమయం వినియోగించారంటూ డిపార్ట్‌మెంట్ తరపున ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ పొందిన వారిలో ట్రాఫిక్ వింగ్ అడిషనల్ డీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ బి. కృష్ణమోహన్, 3 ట్రాఫిక్ ఏఎస్ఐ డి. నయోమి, ఏఆర్ ఏఎస్ఐ కె. కోటేశ్వరరావు, హెచ్‌సీలు ఆర్. శివకృష్ణ, వై. దేవిడ్‌రాజు ఉన్నారు. కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం. రాజారావు, ఏట సునీత, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాఫిక్ అధికారులు, సీపీఓ సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



క్రీడాకారులను సత్కరిస్తున్న పాఠశాల కార్యదర్శి ఎల్వీ మోహనరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని సాహితీవేత్త, పాఠశాల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ జూపూడి రామకృష్ణ అన్నారు. కొత్తపేట హిందూ హైస్కూల్ ప్రాంగణంలో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జూపూడి రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల మాట్లాడుకునే భాషలోనే పాఠ్యపుస్తకాలతో సహా భాషకు సంబంధించిన అన్ని వ్యవహారాలు సాగాలని గిడుగు వెంకట రామమూర్తి పాటుపడ్డారన్నారు. పాఠశాల కార్యదర్శి కేఎల్వీ మోహనరావు మాట్లాడుతూ ప్రజల భాష కోసం పరితపించిన పుణ్యజీవిగా గిడుగును అభివర్ణించారు. తొలుత గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. క్రీడల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులు, పీఈటీ ప్రసాద్‌ను సత్కరించారు. హెచ్‌ఎం కంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల ప్రతినిధి బ్రహ్మేశ్వరరావు, కె.శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కృష్ణ, వ్యాయామాధిపతి ఎంవీ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఉషారాణికి పీహెచ్‌డీ ప్రదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ):విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామానికి చెందిన ఉషారాణి ఇల్లూరికి డిగ్రీ ఆఫ్ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు (పీహెచ్‌డి) పట్టా లభించింది. జముక్లపూడి ప్రకాశం సాహిత్యం – సమగ్ర పరిశీలన అంశంపై ఆమె ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు/ప్రాచ్య భాషా విభాగానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసానికిగాను సీహెచ్‌డీ ప్రదానం చేశారు. విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ జి.కృష్ణంరాజు పర్యవేక్షణలో ఉషారాణి పరిశోధన పూర్తి చేశారు. విజయవాడలోని ఒక ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తూ డాక్టరేట్‌ను సాధించారు. ఈ సందర్భంగా ఆమెను ఏఎన్‌యు తెలుగు హెచ్‌ఓడీ ప్రొఫెసర్ కృష్ణారావు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ పాఠశాలలో హెవీ మోటార్ వెహికల్ (హెచ్‌ఎంవీ) డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షేక్ షాహిద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తుకు లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్(ఎల్ఎంవీ), హెవీ డ్రైవింగ్ లెర్నర్స్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్ఎల్ఆర్) పత్రాలను జత చేసి కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సెప్టెంబర్ 7వ తేదీ లోగా అందజేయాలని కోరారు. సెల్: 96520 57244 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

సెప్టెంబర్ 6న అనంత పద్మనాభ స్వామి వ్రతం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసిన శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సెప్టెంబర్ 6న శ్రీ అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తెలిపారు. స్వామి వారి ఆలయం ప్రాంగణంలో కొలువై ఉన్న అనంత పద్మనాభ స్వామి మందిరంలో ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలు, తులసీ దళ అర్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలోనే స్వామి వారి వ్రతం నిర్వహిస్తారని చెప్పారు. వ్రతంలో పాల్గొనే ఉభయదాతలు, భక్తులు ఆలయ ప్రాంగణంలోని కార్యాలయ సిబ్బంది, అర్చకులను సంప్రదించాలని ప్రధాన అర్చకులు రామరత్నమాచార్యులు పేర్కొన్నారు.

డీఎస్సీలో అవకతవకలను సరిదిద్దాలి

పీడీఎస్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): డీఎస్సీ నియామక ప్రక్రియలో చోటు చేసుకున్న అవకతవకలను తక్షణం సరిదిద్దాలని పీడీఎస్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరక శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. మెగా డీఎస్సీ- 2025 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న అనేక అవకతవకలను, గందరగోళాలను పీడీఎస్‌వో తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను సంపూర్ణ పారదర్శకతతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్షా ఫలితాల విడుదల సమయంలో మెరిట్ జాబితాను ప్రకటించకుండా, అభ్యర్థులకు వ్యక్తిగత కాల్ లెటర్స్ పంపుతామని ప్రకటించడంతో ఎదురైన వ్యతిరేకత, ఆందోళనల కారణంగా ఆగస్టు 22న మెరిట్ జాబితాను ప్రకటించారని పేర్కొన్నారు. అయినప్పటికీ తదుపరి నియామక ప్రక్రియలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని, ఈ అవకతవకలు అభ్యర్థులలో తీవ్ర అసంతృప్తిని, ఆందోళనను కలిగిస్తున్నాయన్నారు. సెలక్షన్ జాబితాను ప్రకటించకుండా గోప్యంగా ఉంచడం, కేటగిరీల వారీగా కట్ ఆఫ్ మార్కులను విడుదల చేయకపోవడం, కొంత మందికి కాల్ లెటర్స్ పంపకపోవడం, కొందరు అభ్యర్థుల లాగిన్‌లో కాల్ లెటర్స్ కనిపించకపోవడం వంటి అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. 10 ఏళ్ల తర్వాత విడుదలైన 16,347 ఉపాధ్యాయ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 5.77 లక్షల మంది అభ్యర్థులు ఎంతో ఆసక్తితో, కఠోర శ్రమతో కోచింగ్ తీసుకుని దరఖాస్తు చేసుకున్నారన్నారు. 50,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, కేవలం 16,347 పోస్టుల భర్తీ ప్రక్రియలోనూ ఇంతటి నిర్లక్ష్యం, అవకతవకలు చోటుచేసుకోవడం సహించరానిదన్నారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియను సంపూర్ణ పారదర్శకతతో నిర్వహించాలని, సెలక్షన్ జాబితాను తక్షణం విడుదల చేయాలని, కేటగిరీల వారీగా కట్ ఆఫ్ మార్కులను ప్రకటించాలని తదితర అంశాలపై ఆయన డిమాండ్ చేశారు.

PUBLIC NOTICE

General Public is hereby informed that, my client Sri. **Gonuguntla Srinivasa Kumar,** S/o Late Gonuguntla Ranga Rao, is intending to purchase the property described in the Schedule hereunder from its true owner Sri. Shikhakolli Padmavathi, W/o. Shikhakolli Venkata Ranga Rao, and in furtherance of the same, Agreement of Sale Dated: 04-08-2025 was entered into by the parties & part payments were also made by my Client. That, if any person or persons have any objection or right/claim/title/interest in respect of said property, the same shall be communicated within Seven (7) days from the date of this publication to the undersigned at the below mentioned address with all relevant original documents, and if no claim or objections are received it would be deemed that there is none, and the transaction would fructify into a registered document. The claims without documentary proof and/or objections directly published in the newspaper shall not be considered.

SCHEDULE: All the part and parcel of the Building bearing D.No.11-62-80, consisting of Ground Floor Madras terraced + two floors, admeasuring 27-22 square yards situated at, Canal Road, Vijayawada-1, N.T.R. District, Municipal Ward No.11, Revenue Ward No.6, Block No.3, N.T.S. No.288, Old Assessment No.7682, New Assessment No.60152, present Assessment No.1073024466, with the following boundaries:- East: Joint wall between schedule of property & Property of Nandipati Venkata Narayana South: Hyderabad Road, West: Joint wall between schedule of property & Property of Sanka Venkaiah & others, North: Joint wall between Schedule of Property & Property of Mandavalli Satyanarayana murthy.

TUPAKULA NIKHIL, B.A., LL.B. (Hons.), Advocate
Office at: # Flat No.207, II Floor, Sai Sri Towers, Street No.4, Himayath Nagar, Hyderabad-500 029.
Mobile No. 8520855599

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి దారుణం



వైఎస్సార్ కాలనీ రోడ్డులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపునకుగురై ప్రజలు అతలాకుతలమై ఏడాది కావస్తున్నా కూటమి ప్రభుత్వం ఇంత వరకు వరద నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించడం దారుణమని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బుడమేరు ముంపునకు శాశ్వత నివారణ చర్యగా కృష్ణలంకలో కట్టినట్లుగా రిటైనింగ్‌వాల్ నిర్మాణం చేపట్టాలని, అందుకు తక్షణమే రూ.10 వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జక్కంపూడి వైఎస్సార్ కాలనీ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ బుడమేరు వరద నష్టం రూ.15 వేల కోట్ల మేర అంచనాల ప్రతిపాదనలను కేంద్రానికి పంపించామని ముఖ్యమంత్రి ప్రకటించి ఏడాది అవుతున్నా నేటికీ కేంద్రం నుంచి నిధులు రాకపోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు వైఫల్యమని మండిపడ్డారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో వైఫల్యం చెందిన జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీన వరద ముంపు బాధితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించనున్నామని తెలిపారు. వైఎస్సార్ కాలనీ సీపీఎం కమిటీ నాయకులు కె.రవి, ఎ శ్రీనివాస్, విజయదుర్గ, పరమేశ్వరరావు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భార్యతో మనస్పర్థల కారణంగా విడిగా ఉంటున్న వ్యక్తి జీవితంపై విరక్తితో కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాంబేకాలనీలో నివాసముంటున్న షేక్ బాజీ (37), నజీమా భార్యాభర్తలు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. బాజీ కారు డ్రైవర్‌గా పని చేస్తు జీవిస్తున్నాడు. రెండేళ్ల క్రితం వివాదాలు చోటు చేసుకోవటంతో బాజీ ఆటోనగర్‌లో విడిగా ఉంటున్నాడు. నజీమ తన పిల్లలతో వాంబేకాలనీలోనే నివాసముంటుంది. అయితే మద్యం అలవాటు ఉన్న బాజీకి ఇటీవల ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో తెనాలిలోని తన అక్క ఇంటికి వెళ్లి 29వ తేదీన తిరిగి విజయవాడకు వచ్చాడు. శుక్రవారం రాత్రి బాజీ అతని మిత్రుడు కిట్టు ఇద్దరూ మద్యం తాగి ప్రకాశం బ్యారేజీ మీదకు వచ్చారు. బాజీ ఒక్కసారిగా 67వ ఖానా నుంచి నదిలోకి దూకేశాడు. ఒక్కసారిగా జరిగిన పరిణామానికి కిట్టుకు ఏమి అర్థం కాలేదు. దాంతో కిట్టు బాజీ అక్కకు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని వివరించాడు. ఆమె బాజీ భార్య నజీమకు ఫోన్ చేసి వివరాలను తెలియజేసింది. ఈ మేరకు నజీమ వన్‌టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేఎల్‌రావునగర్‌కు చెందిన ఆర్. హరిప్రసాద్‌రాజు హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. సెలవుపై విజయవాడ వచ్చిన హరిప్రసాద్ రాజు శుక్రవారం సింగ్‌నగర్‌లో ఉన్న అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లాడు. శనివారం ఒబర్‌లో మోపెడ్ బుక్ చేసుకుని తిరిగి కేఎల్‌రావునగర్ బయలుదేరాడు. కంసాలిపేట ర్యాంప్ నుంచి ఎర్రకట్ట ఎక్కే క్రమంలో బుల్లెట్‌పై వస్తున్న ఓ వ్యక్తి వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. దీంతో హరిప్రసాద్ రాజు తలకు, చాతీకి, వెన్నుపూసకు గాయాలు కావడంతో వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ఎన్‌జీవో సంఘం సమావేశం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుధాకరరావు తెలిపారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవో భవనంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు భవనారి వెంకటేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి సుధాకరరావు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలు చర్చకు ఉంటాయన్నారు.

4న హుండీ లెక్కింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపులు, మొక్కుబడులను 4వ తేదీ లెక్కించనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. 4వ తేదీ ఉదయం 7 గంటలకు మహా మండపం ఆరో అంతస్తులో కానుకల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఆలయ, సేవా సిబ్బంది ఈ లెక్కింపులో పాల్గొంటారన్నారు.